సాక్షి
మంచిర్యాల
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



అటకెక్కిన 'చెత్త'శుద్ధి

ఉమ్మడి జిల్లాలో కంపోస్టు షెడ్లు క్రమంగా నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వినియోగించడం లేదు. 8లో▶



మత్తు.. యువత చిత్తు..!

ఒక వైపు గుడుంబా తయారీ మరోవైపు గంజాయి విక్రయం వెరసి యువత జీవితాలు నాశనం చేస్తున్నాయి. 9లో▶

గరిష్టం/కనిష్టం
36.0 /22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

పన్ను వసూళ్లు అంతంతే..!



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

- 40 రోజులే గడువు..
- జిల్లాలో ఏడు బల్దియాలు.. ఇందులో ఐదు సగం కూడా చేరువ కాలే
- లక్సెట్టిపేట్ బెటర్.. చెన్నూర్ పూర్

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్ల తీరు..

మున్సిపాలిటీ	ఇళ్లు	వసూలు కావాల్సింది (రూ.కోట్లలో)	ఇప్పటివరకు వసూలైంది (రూ.కోట్లలో)	వసూలైన శాతం
మంచిర్యాల	26,552	17.73	8.16	46.04
నస్పూర్	16,026	4.27	2.00	46.0
క్యాతన్‌పల్లి	11,851	4.29	1.95	45.0
బెల్లంపల్లి	12,671	3.65	2.00	54.95
మందమర్రి	13,260	2.21	1.05	47.73
లక్సెట్టిపేట	5,726	1.43	1.12	78.79
చెన్నూరు	6,588	2.46	0.96	39.26

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఓ వైపు ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు సమీపిస్తుండగా చాలా చోట్ల కనీసం సగం లక్ష్యం కూడా చేరుకోలేదు. లక్సెట్టిపేట 78 శాతంతో ముందు వరుసలో ఉండగా చెన్నూర్ 39 శాతంతో చివరన నిలిచింది. మున్సిపాలిటీలకు పన్నుల వసూళ్లే ప్రధాన ఆదాయ వనరు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి బల్దియా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆ శాఖ అధికారులు పదే పదే చెబుతున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండానే కాలం వెల్లదీస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయం సమకూరక అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. బల్దియాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికులకు సైతం వేతనాలు చెల్లించలేని పరిస్థితి. జిల్లాలో గతంలో మూడు మున్సిపాలిటీలు మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి ఉండగా.. నాలుగేళ్ల క్రితం నస్పూర్, క్యాతన్‌పల్లి, లక్సెట్టిపేట్, చెన్నూరు కొత్తగా ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు వసూళ్ల పరంగా చూస్తే లక్సెట్టిపేట, బెల్లంపల్లి మినహా మిగతా ఐదు బల్దియాలు కనీసం సగం లక్ష్యం కూడా చేరుకోకపోవడం గమనార్హం.

జిల్లా కేంద్రం పరిస్థితి ఇదీ..

మంచిర్యాల మున్సిపాలిటీ గ్రేడ్-1గా పేరున్నా పన్ను వసూళ్లలో మాత్రం వెనుకబడి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.17.73 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ. 8.16 కోట్లు మాత్రమే వసూలైంది. మరో 40 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నా స్పందన ఉండడం లేదు. గడువులోపు వందశాతం లక్ష్యం పూర్తి కావడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మిగతా బల్దియాల్లో..

లక్సెట్టిపేట, బెల్లంపల్లి మినహా క్యాతన్‌పల్లి, మందమర్రి, నస్పూర్‌లలో 50 శాతంలోపే వసూలయ్యాయి. చెన్నూర్‌లో కేవలం 39 శాతం మాత్రమే వసూలుకావడం గమనార్హం.

వందశాతం వసూలు చేస్తాం



అందరి సహకారంతో ఈ ఏడాది వంద శాతం పన్నుల వసూలు లక్ష్యాన్ని అధిగవిస్తామనే నమ్మకముంది. పన్ను చెల్లింపు విషయంలో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకుండా చూస్తున్నాం. పెద్ద ఎత్తున బకాయిలు ఉన్న వారికి కేవలం 15 రోజులు సమయం ఇస్తాం. ఆ లోపు తప్పనిసరిగా చెల్లించాలి. లేదంటే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– రావుల ఉప్పలయ్య, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్

వడ్డీ మాఫీ ఉంటుందనే....!

ఆయా బల్దియాల్లో సాధారణ, మధ్యతరగతి ప్రజలు మున్సిపాలిటీకి ఏటా పన్ను చెల్లిస్తున్నారు. అయితే బడా వ్యాపారులు, పేరున్న వారు, పెద్ద పెద్ద భవనాలు ఉండి, రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్న వారే ఎక్కువగా ట్యాక్స్ చెల్లించేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. మంచిర్యాల మార్కెట్‌లోని భవనాలు కలిగిన వ్యాపారస్తుల్లో చాలా మంది రూ.40 లక్షలకు పైగానే ఆస్తి పన్ను బకాయి ఉన్నారు. సిబ్బంది పన్ను వసూళ్లకు వెళ్తే రాజకీయ పలుకుబడి ఉపయోగించి చెల్లించకుండానే పెద్ద ఎత్తున బకాయి పడుతున్నారు. ఈ సారి కూడా వడ్డీ మాఫీ ఉంటుందనే కారణంతో కొందరు పన్నులు చెల్లించడం లేనట్లు తెలుస్తోంది.

ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మల్లారెడ్డి ఎన్నికల పరిశీలకునిగా, అడ్వకేట్ శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ ఎస్ వేణుగోపాలాచారి, చైర్మన్‌గా కె.పార్థసారథి, అధ్యక్షుడిగా బి.గోవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శిగా పి.రఘునాథరెడ్డి, ట్రెజరర్‌గా కనపర్తి రమేశ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, ఎన్.శ్రీధర్‌రెడ్డి, ఎం.సాంబమూర్తి, యు.చంద్రమోహన్ గౌడ్, ఎం.శ్రీనివాస్, కే.చంద్రయ్య, జాయింట్ సెక్రెటరీలుగా పుల్లూరి సుధాకర్, సుకుమార్ ఫ్రాన్సిస్, బి.రమేశ్, కే.శేఖర్, కే.పాండునాయక్, కే.శ్రీనివాసరాజు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఈ.మారయ్య, ఎల్.శరత్‌బాబు, బి.శ్రీనివాస్‌గౌడ్, డి.దేవేందర్, ఎన్.హరిచరణ్, భూమన్న, ఈశ్వరాచారి, మహేందర్‌సింగ్, చీఫ్ అడ్వైజర్‌గా కే. సుదర్శన్‌గౌడ్, అడ్వైజర్లుగా బి. బాబురావు, పరిమళ, లీగల్ అడ్వైజర్లుగా చిట్ల రమేశ్, నిమ్మతి శ్రీనివాస్, టెక్నికల్ అడ్వైజర్‌గా ఎండీ నజీర్ ఎన్నికయ్యారు.

ప్రవేశ పరీక్షకు స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆదివారం నిర్వహించిన ప్రవేశ అర్హత పరీక్షకు విద్యావంతులైన నిరుద్యోగుల నుంచి భారీ స్పందన లభించింది. బెల్లంపల్లి అభివృద్ధి సంస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవేశపరీక్షను నిర్వహించారు. సదరు సాఫ్ట్‌వేర్ కంపెనీ లో 75పోస్టులు ఉండగా ఏకంగా 546 మంది విద్యావంతులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్ కిరణ్ మృదుల, బీఏఎస్ సెక్రెటరీ ఆదర్శవర్ధన్ రాజు, జాయింట్ సెక్రెటరీ కోడూరి కృష్ణ, కోశాధికారి సుధాకర్, హెచ్ఆర్ రజని, మౌనిక పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గూడెంలో బ్రహ్మోత్సవాలు షురూ



సప్తాహంలో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గుట్టకింది నుంచి వాయిద్యాల నడుమ స్వామివారి చిత్రపటంతో గుట్టపైకి చేరుకున్నారు. ఆలయం ముందు గల మండపం వద్ద సప్తాహ భజనలు ప్రారంభించారు. అనంతరం నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, విశ్వక్సేనారాధన, దీక్ష కంకణధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఈవో శ్రీనివాస్, వ్యవస్థాపక సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి, వేదపారాయణదారు నారాయణశర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'తెలంగాణ గెలుపు' పుస్తక పరిచయం



మాట్లాడుతున్న మలయశ్రీ

మంచిర్యాలఅర్బన్: ముత్యబోయిన మలయశ్రీ రచించిన 'తెలంగాణ గెలుపు' పుస్తక పరిచయ కార్యక్రమం స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంకొండ మల్లారెడ్డి హాజరుకాగా శ్రీనాథ్‌గౌడ్, సంతోష్ వాద్య సహకారం అందించారు. పరిచయ కర్త తన ప్రసంగంలో పుస్తకంలోని పలు గేయాలను ఆలపించారు. వక్తలు మాట్లాడుతూ, ఉద్యమంలో మలయశ్రీ రచయితగా, తెలంగాణ ఉద్యమకారుడిగా తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు, రచయితలు దక్షిణామూర్తి, సుగుణాకర్, లక్ష్మీ, రామస్వామి, రాజేశంగౌడ్, వైకుంఠం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

మంచిర్యాలఅర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక మార్క్స్‌భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానంతో పాటు కార్పొరేట్ విద్య సంస్థలను రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వసతిగృహాల్లోని విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు చరణ్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, రాహుల్, సహాయ కార్యదర్శి సిద్ధార్థ, కోశాధికారి దీపిక తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. జిల్లాలో పట్టణ, మండలస్థాయి ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌లను ఆదివారం నిర్వహించారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ జోబిన్, ఇన్‌చార్జి గోవర్ధన్ ప్రశ్నాపత్రం అవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు అభినవ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

'నాగోబా' ఆదాయం రూ.17.71 లక్షలు

- హుండీ ద్వారా రూ.8.62 లక్షలు..
- తైబజార్ ద్వారా రూ.9.09 లక్షలు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ ఏడాది నాగోబా జాతర ఆదాయం రూ.17.71 లక్షలు సమకూరింది. ఈ నెల 9 నుంచి 17వరకు జాతర కొనసాగింది. ఇందులో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆదివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 8లక్షల 62 వేల 15, తైబజార్ ద్వారా రూ.9 లక్షల 9 వేలు, కానుకల రూపంలో 425 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసు, కోసేరావ్, బాదిరావ్‌పటేల్, వంశ ఉద్యోగులు శేఖర్‌బాబు, సోనేరావ్, కోసేరావ్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర బస్సులు ప్రారంభం



జాతర బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



చెన్నూర్‌లో బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల నుంచి మేడారం జాతరకు వెళ్లే బస్సులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్, ఆర్ఎం సోలోమాన్ రాజ్, డీఎం రవీంద్రనాథ్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు నరేశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు భానేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ నుంచి ఈసారి అదనపు బస్సులు..

చెన్నూర్: మేడారం భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ ఏడాది అదనపు బస్సుల సౌకర్యం కల్పించిందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక బస్టాండ్ నుంచి జాతర బస్సులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో మేడారం జాతరకు 55 బస్సులను ఏర్పాటు చేయగా ఈ సారి వాటి సంఖ్య 85కు పెంచినట్లు చెప్పారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయణ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్, రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్: స్థానిక బస్టాండ్ సమీపంలోని మైదానంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం స్పెషల్ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం జాతర కోసం రూ.105 కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి జిల్లా నుంచి 300 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం సీసీసీలోని ముక్కిడి పోశమ్మ వద్ద నిర్వహించనున్న సమ్మక్క జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, ఆర్టీసీ ఆర్ఎం సోలోమెన్, డిప్యూటీ ఆర్ఎంలు ప్రణయ్, ప్రణీత్, డీఎంలు అమృత, రవికుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, కౌన్సిలర్లు కుమార్, మహేశ్ తదితరులున్నారు.



జాతర పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు

పనులు త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గోదావరి తీరాన నిర్వహించనున్న సమ్మక్క జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులన్నింటిని పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు భక్తులు ఉండేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఇంకా అందని 'గుర్తింపు'

- ఎన్నికలు పూర్తయి రెండు నెలలు
- ఏఐటీయూసీకి అధికారికంగా దక్కని గుర్తింపు హోదా
- జాప్యంతో మొదలు కాని స్ట్రక్చరల్ సమావేశాలు
- గుర్తింపు కాలపరిమితిపై సస్పెన్స్



ఏఐటీయూసీ గుర్తు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీకి అధి కారిక పత్రం అందలేదు. డిసెంబర్ 27, 2023న 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగా యి. ఇందులో ఏఐటీయూసీ ఘన విజయం సా ధించి కంపెనీలో గుర్తింపు సంఘంగా నిలిచింది. మొత్తం 11 డివిజన్లలో అత్యధికంగా ఓట్లు సా ధించి గుర్తింపు హోదా కైవసం చేసుకుంది. వీటిలో ఐదు డివిజన్లు ఏఐటీయూసీ గెలువగా మిగతా ఆరు ఏరియాలో ఐఎన్టీయూసీ గెలిచి ప్రాతిని ధ్య సంఘంగా నిలిచింది. రెండు నెలలు గడుస్తు న్నా ఇప్పటికీ ఏఐటీయూసీకి అధికారిక పత్రం అందకపోవడంతో ఆ యూనియన్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో యూనియ న్ల వారీగా వచ్చిన ఓట్లు, గుర్తింపు సంఘం, ప్రా తినిధ్య సంఘాలను ప్రకటిస్తూ ఆర్ఎల్సీ ఇది వ రకే కంపెనీకి లేఖ అందించింది. దీని ఆధారంగా కంపెనీ చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం డైరెక్ట ర్ పా ఆధ్వర్యంలో నోట్ ఫైల్ తయారు చేసి త రువాత గుర్తింపు సంఘంగా ఏటీయూసీని, ఆరు ఏరియాల్లో గెలిచిన ఐఎన్టీయూసీని ప్రాతినిధ్య సంఘంగా గుర్తిస్తూ అన్ని ఏరియాలకు ఆదేశాలివ్వాలి. అయితే ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం అ వుతోంది. దీంతో కంపెనీలో నిర్వహించాల్సిన స్ట్రక్చరల్, సేఫ్టీ, జేసీసీ సమావేశాలకు బ్రేక్ పడింది. గత గుర్తింపు సంఘం కాలంలోనూ ఇవి సక్రమంగా కొనసాగలేదు. మూడేళ్లుగా ఈ సమావేశాలన్నీ బంద్ అయ్యాయి. కొత్తగా గెలిచిన ఏఐ టీయూసీతోనైనా మళ్లీ మొదలవుతాయనుకుంటే ఇప్పటికీ కంపెనీ అధికారికంగా గుర్తింపు ప త్రం ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే క్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకుల మధ్య ప్రొటోకాల్ సమస్య కూడా ఉత్పన్నం అవుతుంది.

కాలపరిమితి ఎంత..?

ఇదిలా ఉంటే ఎన్నికల ముందు వరకు గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లుగా ఉంది. కంపె నీ ప్రస్తుతం రెండేళ్లకు మొగ్గు చూపుతున్నట్లు చ ర్చ సాగుతోంది. అయితే సంస్థ దీనిపై అధి కారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతర్గతంగా మాత్రం నాలుగేళ్లు కొనసాగించాలా.. రెండేళ్లకు కుదించాలా అన్న చర్చ ఉన్నత స్థాయి వర్గాల్లో జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. ఇదే జరిగి తే తాము న్యాయం పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఏఐటీయూసీ నేతలు పేర్కొంటున్నారు.

2003 నుంచి 'నాలుగేళ్లు' కొనసాగింపు..

ఇదిలా ఉంటే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు 1998 నుంచి మొదలయ్యాయి. మొదటి రెండు దఫాలు రెండేళ్ల కాలపరిమితితో కొనసాగగా.. తరువాత 2003 నుంచి నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 2017 ఎన్నికల్లో కూడా నాలుగేళ్ల పరిమితి అమలు చేశారు. ఇటీవల జరిగిన ఏడో దఫా ఎన్నికల ముందు ఆర్ఎల్సీ సమక్షంలో కూడా అన్ని సంఘాలు నాలుగేళ్లే ఉండాలని సీఎల్సీని కోరుతూ లేఖ రాసిచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆధునిక రైతువేదికలు

- అందుబాటులోకి వీడియో కాన్ఫరెన్స్ సేవలు
- శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో రైతులు ముఖాముఖి
- పైలెట్ ప్రాజెక్ట్‌గా 'భీమిని' ఎంపిక



వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ ఉన్నతాధికారులు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సాగులో మూస పద్ధతులతో పాటు విత్తన వ్యాపారుల మాటలు నమ్మి రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. అన్నదాతకు ఇక అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో వారికి తగిన సలహాలు, సూచనలు అందించి అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం సంకల్పించింది. గత సర్కారు రైతుల కోసం రైతువేదికలు అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విధితమే. వీటిని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దేలా ఉద్దేశంతో తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక సమావేశంలో ఇటీవల నిర్ణయించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు రైతులతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేసి వారి ద్వారా సలహాలు, సూచనలు అందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ వంటి కార్యక్రమాలు సైతం నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో జిల్లాలో భీమిని రైతువేదిక పైలెట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులోకి వచ్చింది.

పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇలా..

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మల్బరీ, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన అన్ని పథకాల సమాచారం రైతులకు అందుతోంది. తద్వారా ఎంతమేర ప్రయోజనం చేకూరుతుందో వారి నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. ఏఈవో కార్యాలయాలుగా ఉన్న రైతువేదికలో ఇంటర్నెట్, వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ఏర్పాట్లతో పాటు మరింత ఫర్నిచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈమేరకు మంచి ఫలితాలు వస్తే మిగతా రైతువేదికల్లో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది.

అన్నదాతకు అండగా..



రైతువేదికలు అన్నదాతకు మరింతగా అండగా నిలవనున్నాయి. భీమిని రైతు వేదిక పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. స్థానిక రైతులతో వ్యవసాయశాఖ మంత్రి ఇప్పటికే ఇందులో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉన్నతాధికారులు, ఏవోలు, ఏఈవోలు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతులు తమ సందేహాలు తీర్చుకుని సాగులో లబ్ధిపొందవచ్చు.

– కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

ఘనంగా సంత్ సేవాలాల్ ఉత్సవాలు



మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న రేఖానాయక్

జన్నారం: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో ఆదివారం మాజీ ఎమ్మెలే అజ్మీరా రేఖానాయక్ పాల్గొన్నారు. జన్నారం మండల కేంద్రంలోని జువ్విగూడ ఆలయానికి రేఖానాయక్ చేరుకోగానే స్థానికులు స్వాగతం పలికారు. జగదాంబ దేవి, సంత్ సేవలాల్ మహరాజ్ దేవతా మూర్తులకు పూజలు చేశారు. అనంతరం బంజార మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు సందేశ్, భీంలాల్, తిరుపతి, ప్రేంసింగ్, సంతోష్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


కవితాబాయి మృతదేహం

సారంగపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ కవితాబాయి (40), భర్త రమేష్‌లకు మధ్య కొద్దిరోజులుగా మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన కవితాబాయి గోపాల్‌పేట్ చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కవితాబాయి మృతిపై ఆమె సోదరుడు జాదవ్ రవి అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..


విజయ్(ఫైల్)

కౌటాల: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన సూరం విజయ్ (24), పల్లవి భార్యభర్తలు. వీరికి కుమార్తె ఉంది. విజయ్..వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ భారంగా మారడంతో ఈనెల 14న రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి లోనై విజయ్ భార్యపై చేయిచేసుకోవడంతో అదే రాత్రి పల్లవి తన పుట్టింటికి వెళ్లింది. మేడారం జాతర వెళ్లేందుకు భార్యను పంపించాలని విజయ్ శనివారం సాయంత్రం అత్తకు ఫోన్ చేశాడు. పంపించనని చెప్పడంతో మనస్తాపం చెంది రాత్రి తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు ఆదివారం పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి అన్నయ్య బానేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి గర్భిణి ఆత్మహత్యాయత్నం

భైంసా: బాసర గోదావరి వద్ద గర్భిణి కుటుంబ కలహాల నేపథ్యంలో గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాసర ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన మూడు నెలల గర్భిణి ఆదివారం బాసరకు చేరుకుంది. స్థానిక గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సమీపంలో ఉన్న గంగపుత్రులు ఆమెను కాపాడారు. అనంతరం బాసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.

అటకెక్కిన 'చెత్త'శుద్ధి


కోటపల్లి మండలం బబ్బరుచెల్కలో నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు

- ఉమ్మడి జిల్లాలో నిరుపయోగంగా షెడ్లు
- కొన్ని గ్రామాలకు దూరంగా..
- నెరవేరని ప్రభుత్వ ఆశయం

కోటపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు వెచ్చించింది. గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని పంచాయతీల్లో షెడ్లు గ్రామానికి దూరంగా ఉండటంతో వినియోగించడం లేదు. ప్రతీ జీపీకి ఒక ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని చోట్ల నిత్యం జరగకపోవడంతో గ్రామీణ ప్రజలు ఖాళీ స్థలాల్లోనే పడేస్తున్నారు. వర్షాకాలంలో ఆ చెత్త తడిసి దుర్గంధం వెదజల్లుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..		
జిల్లా	పంచాయతీలు	ప్రత్యేకాధికారులు
మంచిర్యాల	311	138
కుమురంభీం	335	125
నిర్మల్	396	176
ఆదిలాబాద్	468	123

తయారుకాని ఎరువు!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తోపాటు నీళ్ల ట్యాంకర్ కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో బుట్టలు పంపిణీ చేసింది. వీటిని కొంతవరకే పంపిణీ చేయగా..చాలామందికి చెత్త బుట్టలు రాకపోవడంతో వారు తడి,పొడి చెత్తను వేరు చేయకుండా ఇష్టానుసారంగా అందిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది వాటిని వేరుచేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామ పంచాయతీలు విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలనేది వీటి ఉద్దేశం. చాలావరకు గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలే లేవు. కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా ఉంటుండటంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

వృథాగా నిర్మాణాలు

సేంద్రియ ఎరువు తయారీ చేసేలా కంపోస్టు షెడ్లు నిర్మించారు.బ్లాకులవారీగా నిర్మాణాలు చేపట్టారు. వీటిలో చాలారోజుల వరకు చెత్తను నిల్వ చేసి ఎరువుగా మారుస్తారు. ఈ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. జాగా లేదని కొద్దిస్థలంలో నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఒకేస్థలంలో శ్మశానవాటిక,పక్కనే కంపోస్టు షెడ్లు నిర్మించారు. అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీ చర్యలు తీసుకుంటాం. – అక్తర్, ఎంపీవో, కోటపల్లి

బర్త్ డే వేడుకల్లో అపశ్రుతి

- కేక్ తిని చిన్నారులకు అస్వస్థత
- చెన్నూర్‌లో ఘటన


స్వీట్ షాపు వద్ద పాడైన కేక్‌తో మహేందర్

చెన్నూర్: స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకునే పుట్టినరోజు వేడుకల్లో అపశ్రుతి జరిగింది. పలువురు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన చెన్నూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రజక కాలనీకి చెందిన నిమ్మల శ్రీకాంత్ కుమారుడు మహేందర్ బర్త్‌డే వేడుకల సందర్భంగా శనివారం రాత్రి స్నేహితులు, కుటుంబీకుల మధ్య కేక్‌కట్ చేశారు. మహేందర్‌తోపాటు పలువురు కేక్ తిని వాంతులు చేసుకున్నారు. కేక్ లోపలి, కింది భాగం బూజు పట్టి ఉండడాన్ని మహేందర్ తండ్రి శ్రీకాంత్ గుర్తించి మహదేశ్ స్వీట్ హౌజ్‌కు వెళ్లాడు. పాడైన కేక్‌ను వ్యాపారికి చూపిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని తెలిపారు. వ్యాపారులు పాడైన కేక్‌లు విక్రయించి చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారులు నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేకే ఓసీపీ సందర్శన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్, పా) శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఓసీపీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గనికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరో 40 రోజుల్లో ఆర్థిక సంవత్సరం పూర్తికానున్న సందర్భంగా ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అంతకుముందు సిమ్‌టర్స్ సెంటర్‌లో త్వరలో ఏర్పాటుచేసే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏరియా జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు నాగరాజు, విజయ్‌కుమార్, కేకే ఓసీ పీవో రమేశ్ తదితరులు ఉన్నారు.

పొట్టకూటికి తిప్పలు


నెన్నెలలో తిరుగుతున్న పగటి వేషగాళ్లు

నెన్నెల: పొట్టకూటి కోసం పగటి వేషగాళ్లు గ్రామాల్లో సంచరిస్తూ వివిధ వేషాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రజల నుంచి సంభావనలు తీసుకుంటున్నారు. జానపద కళ అయిన పగటి వేషం బతుకుదెరువు కోసం యాచక వృత్తిగా మారిపోయిందని పగటి వేషగాళ్లు (బుడగజంగాల వారు) చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరు మండలానికి చెందిన పగటివేషగాళ్లు మాయల ఫకీర్, ఆది భైరాగి, నవాబ్, జంగం దేవర, అర్ధనారీశ్వరులు లాంటి వేషం వేసి ప్రదర్శనలు ఇస్తూ ఇంటింటి నుంచి పాత దుస్తులు, డబ్బులు సేకరిస్తూ ఆదివారం సాక్షి కెమెరాకు చిక్కారు. తరతరాలుగా వస్తున్న పగటివేష కళను వృత్తిగా మలుచుకొని పొట్టకూటి కోసం పిల్లపాపలతో తిప్పలు పడుతున్నామని వారు సాక్షికి వివరించారు.

బీఆర్ఎస్ నాయకుడి కేసు

చెన్నూర్: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ తుంగపిండి రాజేశ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వంపై రాజేశ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకు గాను కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పార్టీలు, ప్రభుత్వంతోపాటు ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ఎవరైన పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం


పోటీలను ప్రారంభిస్తున్న శంకర్



గెలుపొందిన విద్యార్థులు

బెల్లంపల్లి: కరాటే విద్య ఆత్మరక్షణకు ఆయుధంగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ అన్నారు. పట్టణంలోని టీసీఓఏ క్లబ్‌లో కట్కూరి మల్లేశ్వరి, నీలి పార్వతి స్మారక రెండో జాతీయ స్థాయి కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. బాల,బాలికలకు చిన్నతనంలో కరాటే శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ విజ్జగిరి రవి, దిలీప్‌కుమార్, నిజామ్, కరాటే మాస్టర్లు కట్కూరి వెంకటేశ్, ఎం.శంకర్, శ్రీనివాస్, ఎనగందుల వెంకటేశ్, ఈశ్వర్‌కుమార్, దేవయ్య, శ్రీనివాస్, రవి, రాజేష్, రాజా, భూషణ్, శివ మహేశ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు చిన్నరాజం, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక శర్వాణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ రామగిరి స్వామి తెలిపారు. ఆరేళ్లలోపు కటా విభాగంలో స్నేహిత్ కుమార్ (బంగారు), ఎనిమిదేళ్లలోపు కటా విభాగంలో ఆర్.సృజన్ (బంగారు) పతకాలు సాధించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలను కరస్పాండెంట్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాస్టర్లు అభినందించారు.

బాల్య వివాహం అడ్డగింత


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని హేటిగూడ గ్రామంలో బాల్యవివాహాన్ని బాలల సంరక్షణ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. సోమవారం బాలికకు వివాహం నిశ్చయించారని సమాచారం అందడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. లీగల్ సెల్ అధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిపిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యవివాహాలతో బాలికకు ఆరోగ్య, మానసిక పరమైన సమస్యలు వస్తాయన్నారు. బాలికను జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. 1098 కోఆర్డినేటర్ ప్రవీణ్, కౌన్సిలర్ రవళి, స్థానిక సిబ్బంది ఉన్నారు.

శనగ కుప్ప దగ్ధం


మంటలార్పుతున్న గ్రామస్తులు

జైనూర్: మండలంలోని ఊశేగాం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు శనగ పంట కుప్ప దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామపటేల్ పెందూర్ అమృత్‌రావు యాసంగిలో ఐదెకరాల్లో శనగ సాగు చేశాడు. ఆదివాసీలు అట్టహాసంగా నిర్వహించే పెద్దదేవుని పూజల నిమిత్తం గ్రామస్తులంతా పటేల్ ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. పానపటార్ నుంచి ఊశేగాం వైపు బైక్‌పై వెళ్తున్న వారు పంట కుప్పలకు మంటలు అంటుకున్న విషయాన్ని గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పగా అప్పటికే దగ్ధమైంది. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.



అ'పూర్వ' సమ్మేళనం

దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారు చదువుకున్న పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – దండేపల్లి

జీవాలతో వలసబాట...


జీవాలతో వస్తున్న కాపరులు

నిజామాబాద్ జిల్లా నుంచి గొర్రెల కాపర్లు నిర్మల్ జిల్లాకు వలసబాట పట్టారు.. మేకలు, గొర్రెలు తీసుకుని పక్షం రోజుల క్రితం జిల్లాకు చేరుకున్నారు. తానూరు, ముధోల్, కుభీర్ మండలాల్లోని ఆయా గ్రామాల శివారులోని పంట పొలాల్లో జీవాలను మేపుతున్నారు. రాత్రివేళ పొలాల్లో జీవాల మంద పెడుతున్నారు. ఇందుకు రైతులు ఒక రోజుకు రెండు అడ్డల బియ్యం, రూ.రెండు వందలు ఇస్తారని కాపరులు చెబుతున్నారు. ఈ నెలలో అక్కడ వరి పంట ఉండదంతో జీవాలకు మేత లేకపోవడంతో ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. మందపెట్టడంతో ఇటు కాపరులు.. అటు భూయాజమానికి ప్రయోజనం చేకూరనుంది. – తానూరు

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి


ఆలయంలో పూజలు చేస్తున్న న్యాయమూర్తి

భైంసా: బాసర సరస్వతీ మాతను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా బాసర చేరుకుని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు శాలువాతో సత్కరించి అమ్మవారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు అందించారు. ఇందులో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఆలయ చైర్మన్ శరత్ పాఠక్, ఈవో విజయరామారావు, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ప్రధానార్చకులు, వేదపండితులు ఉన్నారు.

'విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బస్సు యాత్ర ఇన్‌చార్జి రావులరాంనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగుతున్నట్లు తెలిపారు. బాసర నుంచి ప్రారంభమయ్యే యాత్ర ముధోల్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల మీదుగా బస్సు కొనసాగనుందని తెలిపారు. ఈ నెల 22న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో యాత్ర ఉంటుందని వివరించారు. త్వరలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో 12 పార్లమెంట్ స్థానల్లో గెలిపే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని, యాత్రకు రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్క పుష్పలత, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దిపక్‌సింగ్‌షెకవ్, జిల్లా నాయకులు ఆడావ్ చంపత్‌రావ్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కార్యకర్తలు భీంరావ్, పెందోర్ భీంరావ్ ఉన్నారు.

యూఎస్‌పీసీ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా స్థానిక ఐబీ చౌరస్తా వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరని చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజావేణు, రమేశ్, మోతే జయకృష్ణ, ఆగాచారి, జాకీర్, కిరణ్, అప్పారావు, శంకర్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింకను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

లక్ష్మణచాంద: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన మండలంలోని మునిపెల్లి గోధావరి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని మునిపెల్లి గ్రామ గోదావరి సమీపంలో ఆదివారం గోదావరి గట్టున గల పంటపొలాలో కుక్కలు జింకపై దాడి చేస్తుండగా రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ సిబ్బందితో వెళ్లి చూడగా జింక అప్పటికే మరణించింది. దీంతో వెంటనే మండల పశు వైద్యాధికారి అజయ్ కుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందజేయగా ఆయన అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు. ఇందులో ఎఫ్‌బీవో నూమన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సమీపంలోని అర్బన్ పార్కు వద్ద ఆదివారం జరి గిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. వేమనపల్లి మండలం రాజారం గ్రామానికి చెందిన యువకులు నాయిని గోవర్ధన్, సుమన్‌లు బైక్‌పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లి తిరిగివస్తున్నారు. ఈక్రమంలో చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కారు బైక్‌ను ఢీకొని ఒకరు..

భీమారం: కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నెన్నెల మండలం వెంకటాపూర్‌కు చెందిన జక్కుల కిష్టస్వామి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై చెన్నూర్‌లోని గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఆదివారం భీమారం బస్టాండ్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. కిష్టస్వామికి గాయాలు కాగా, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.